సాక్షి విశాఖపట్నం

సోమవారం । 8 । జనవరి । 2024



సాక్షి స్పెల్ బీకు స్పందన

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రీజినల్ స్థాయి స్పెల్ బీ పరీక్షకు విశేష స్పందన లభించింది. 8లో



శభాష్.. బాల

గుడిలోవలోని విజ్ఞాన్ విహార్ ఆవాస విద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. 8లో



అనంతుని సన్నిధిలో అమర్‌నాథ్

అనంత పద్మనాభ స్వామి, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామిని ఆదివారం మంత్రి అమర్‌నాథ్ దర్శించుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్‌కు మైన్స్ రెన్యువల్ కోసం వినతి



సుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన గర్భాం మైన్స్‌లో మాంగనీస్ ఓర్ మైన్స్, నెల్లిమర్లలోని సారిపల్లి ఇసుక మైన్స్‌ను రెన్యువల్ చేయించాలని ఉక్కు వైఎస్సార్‌టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని సుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్టు యూనియన్ నాయకులు తెలిపారు. వినతి పత్రం సమర్పించినవారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, నాయకులు మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, బోరా శశిభూషణ్‌రావు తదితరులున్నారు.

సిరులతల్లికి బంగారు నెక్లెస్ బహూకరణ



ఈవో శిరీషకు బంగారు నెక్లెస్ అందజేస్తున్న తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్

డాబాగార్డెన్స్ : విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి రూ.లక్షా 16 వేల 750 విలువ చేసే 16 గ్రాముల 525 మిల్లీ గ్రాముల బంగారు నెక్లెస్‌ను ఆలయ ఈవో శిరీషకు తుమ్మిడి బ్రదర్స్ అధినేత తుమ్మిడి రామ్‌కుమార్, ప్రతినిధి శ్రీనివాస్ అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారిచే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. తుమ్మిడి బ్రదర్స్ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నెక్లెస్ అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె తిరుమలేశ్వరరావు, తుమ్మిడి బ్రదర్స్ ప్రతినిధి బాబీ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, మొక్కల విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలను నగర ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.

ముగ్గురికి కరోనా

మహారాణిపేట: విశాఖలో ముగ్గురికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 75 మందికి పరీక్షలు చేయగా ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. 27 మంది హోమ్ ఐసోలేషన్‌లోను, ఇద్దరు ఆస్పత్రుల్లోను ఉండగా.. 36 మంది డిశ్చార్జ్ అయ్యారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 65 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది.

వీసీసీ కప్ గోల్ఫ్ విజేత రాజు



విశాఖ స్పోర్ట్స్ : వైజాగ్‌పట్నం చాంబర్ కామర్స్ గోల్ఫ్ కప్ ఓవరాల్ విన్నర్‌గా వి.వి.జి.ఎస్.రాజు నిలిచారు. ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్‌క్లబ్‌లో ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో పలు డివిజన్లలో గోల్ఫర్లు పోటీపడ్డారు. గోల్డ్ డివిజన్‌లో అశోక్ దయాల్ విజేతగా నిలవగా రామ్‌దొర రన్నరప్‌గా నిలిచారు. సిల్వర్ డివిజన్‌లో అమర్‌కాంత్ విజేతగా టిఎస్‌వర్మ రన్నరప్‌గా నిలిచారు. బ్రాంజ్ డివిజన్ విజేతగా కెసిఎస్ రావు, రన్నరప్‌గా పరేంద్రకుమార్ నిలిచారు. మహిళల విభాగంలో ఎం.సరిత విజేతగా.. ఆహ్వానితుల్లో విన్నర్‌గా అతుల్‌సింగ్ నిలిచారు. విజేతలకు తూర్పు నావికా దళ చీఫ్ కమాండర్ వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాసన్ జ్ఞాపికలు అందించారు.

పండగ శోభ



డాబాగార్డెన్స్ : విశాఖకు పండగ కళ వచ్చేసింది. సంక్రాంతిని పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు భారీగా తరలివస్తుండడంతో జగదాంబ జంక్షన్ కిటకిటలాడుతోంది. కొనుగోలుదారులు పెద్ద ఎత్తున వస్త్ర దుకాణాలకు క్యూ కడుతున్నారు. వేలాది మంది కొనుగోలుదారులతో ఆయా షాపింగ్ మాల్స్ కళకళలాడుతున్నాయి. జగదాంబ జంక్షన్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్, తుమ్మిడి బ్రదర్స్, కేఎల్‌ఎమ్, ఎస్‌ఆర్ షాపింగ్ మాల్, లక్కీ, చందన బ్రదర్స్, కంచి కామాక్షి, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, కంకటాల వంటి పెద్ద షోరూంలకు కొనుగోలుదారులు క్యూ కడుతున్నారు. వస్త్రదుకాణాలు ఆఫర్లు ప్రకటించడంతో పెద్ద ఎత్తున అమ్మకాలు జరుగుతున్నాయి.

ఫుట్‌పాత్ మార్కెట్‌కు గిరాకీ

సంక్రాంతి ఫుట్‌పాత్ మార్కెట్‌కు పండగ తెచ్చింది.



కిక్కిరిసిన జగదాంబ జంక్షన్

అధిక సంఖ్యలో కొనుగోలుదారులు జగదాంబ జంక్షన్‌కు రావడంతో పెద్ద షాపింగ్ మాల్స్‌తో పాటు ఫుట్‌పాత్ మార్కెట్ కూడా బాగానే జరుగుతోంది.

డాబాగార్డెన్స్‌లో కూడా..

డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డులోని లక్కీ షాపింగ్ మాల్, ఆర్కే షోరూం వంటి వస్త్ర దుకాణాలకు కూడా కొనుగోలు దారులు క్యూకడుతున్నారు. ఓ వైపు సెల్ దుకాణాలు.. మరోవైపు వస్త్ర దుకాణాలకు వినియోగదారులు వస్తుండడంతో డాబాగార్డెన్స్ కిటకిటలాడుతోంది.

బాబోయ్ జగదాంబ జంక్షన్

జగదాంబ జంక్షన్‌కు వెళ్లాలంటే ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. ఇసుక వేస్తే రాలనంతగా జనం తరలిరావడంతో ఇటు పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జంక్షన్‌కు వెళ్లాలన్నా.. జంక్షన్ మీదుగా కేజీహెచ్, కలెక్టర్ కార్యాలయం, బీచ్‌కు పోవాలన్నా.. టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డుకు వెళ్లాలన్నా.. అవస్థలు పడాల్సి వస్తోంది. రద్దీ నియంత్రించడంలో ట్రాఫిక్ పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

వైజాగ్.. భలే హుషారు



స్టెప్పులేస్తున్న వెంకటేష్, శ్రద్ధా శ్రీనాథ్

బీచ్‌రోడ్డు : వైజాగ్ వస్తే చాలా హుషారుగా ఉంటుందని హీరో వెంకటేష్ అన్నారు. సైంధవ్ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలను ఆదివారం బీచ్‌రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మొదటి సినిమా నుంచి వైజాగ్ ప్రేక్షకులు తనను ఆదరిస్తూ వస్తున్నారన్నారు. చాలా సినిమాలు వైజాగ్‌లో షూటింగ్ చేశామన్నారు. తన 75వ సినిమా సైంధవ్ ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. ఈ సందర్భంగా సినిమాలోని డైలాగ్స్ చెప్పి అభిమానులను అలరించారు. సైంధవ్ సినిమాకు హీరో సారా పాప అని చెప్పారు. డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ తనకు వైజాగ్ బాగా కలిసి వచ్చిందన్నారు. సైంధవ్ సినిమాను స్టీల్‌ప్లాంట్ కాలనీలో 40 రోజులు షూటింగ్ చేశామన్నారు. హిట్, హిట్-2 సినిమాలు ఇక్కడ షూటింగ్ చేసి మంచి విజయం సాధించామన్నారు. వెంకీమామను ప్రేక్షకులను ఎలా చూడాలని అనుకుంటున్నారో అలాగే ఈ సినిమాలో చూపించామన్నారు. వెంకీమామ 75 సినిమా తనకు ఇవ్వటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్, నటీనటులు పాల్గొన్నారు.

ఫెస్ట్.. ఫెంటాస్టిక్



బుర్రా సాయిమాధవ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: భారతీయ కళలు, పాశ్చాత్య సంగీతం జైపోసన పట్టారు. ప్రాంతీయ అనుబంధం కలిగిన సంగీతవాయిద్యాల నుంచి పాశ్చత్య ఆంగ్ల గీతాలను సైతం అలవోకగా పాడుతూ అలరించారు. 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్ యువభేరిలో భాగంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఉదయం ఫోక్ ఆర్కెస్ట్రా, పాశ్చత్య గీతాపాలన (సోలో), పోస్టర్ మేకింగ్ పోటీలు, మధ్యాహ్నం భారతీయ బృంద గీతాలు, కొల్లాజ్, వెస్టన్ ఇనుస్ట్రుమెంటల్ (సోలో), రంగోలి పోటీలను నిర్వహించారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ వేదికగా వక్తృత్వం, డిబేట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమాలను ఏయూ అబ్జర్వర్ డాక్టర్ మనీష్ జంగ్ర, కల్చరల్ కో ఆర్డినేటర్ ఎన్.విజయ్ మోహన్ పర్యవేక్షించారు.

సినిమారంగంలో నిలిచి గెలిచే శక్తి మీకుంది

సినిమా రంగంలో నిలిచి గెలిచే శక్తి యువతకు ఉందని సినీ రచయిత బుర్ర సాయి మాధవ్ అన్నారు. యువభేరి సాంస్కృతిక పోటీల కార్యక్రమంలో ఆయన ఆదివారం సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ అద్భుతమైన ప్రతిభ కలిగిన యువతను తాను చూస్తున్నానన్నారు. యువతరం తమ లక్ష్యాన్ని వీడకుండా, మాతృభూమిని మరువకుండా తమ ప్రయాణం కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా బుర్ర సాయి మాధవ్‌ను ఏయూ సాంకేతిక పరిశీలకుడు డాక్టర్ మనీష్ జంగ్ర సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు.

అంబేడ్కర్ ఆశయాలకనుగుణంగా జగన్ పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి, ఎమ్మెల్సీ రవీంద్రబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, చిత్రంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మంత్రి బాలరాజు తదితరులు

- 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ
- నియోజకవర్గాల్లో సంబరాలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది: విజయవాడలో ఈనెల 19న రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తెలిపారు. ఆదివారం ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించనున్న నేపథ్యంలో 175 నియోజకవర్గాల్లో సంబరాలు చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చినట్లు తెలిపారు. నేడు రాష్ట్రంలో అంబేడ్కర్ కలలుకన్న విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి మంచి గుర్తింపు లభించిందన్నారు. ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవీంద్రబాబు మాట్లాడుతూ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ 25 ఎకరాల్లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం చిన్న విషయం కాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, పార్టీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, భర్కత్ అలీ, శశికళ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు జాన్ వెస్లీ, పేర్ల విజయ్ చందర్, మాధవీవర్మ పిల్లా సుజాత, జోన్, జిల్లా వివిధ విభాగాల అధ్యక్షులు, డైరెక్టర్లు ముత్తంశెట్టి శివ సందీప్, అల్లంపల్లి రాజబాబు, బొని శివరామకృష్ణ, రామన్నపాత్రుడు, అడ్డాల కృపాజ్యోతి, షరీఫ్ పాల్గొన్నారు.

యువత క్రీడా స్ఫూర్తితో మెలగాలి





విన్నర్, రన్నర్ జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్

మల్కాపురం : క్రీడాకారులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తినింపేందుకు, ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గత నెల 21వ తేదీ నుంచి పశ్చిమ నియోజకవర్గ పరిధిలో క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం జింక్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ జరిగింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. విన్నర్‌గా నిలిచిన జీహెచ్

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- ముగిసిన క్రికెట్ లీగ్ పోటీలు
- విజేతగా నిలిచిన జీహెచ్‌ఎస్ టీమ్
- విన్నర్‌కు ట్రోఫీతోపాటు రూ.2 లక్షలు అందజేత

ఎస్ టీమ్ (92వ వార్డు పరిధి)కు ఆడారి ఆనంద్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యలతో కలిసి ఆయన ట్రోఫీతో పాటు రూ.2 లక్షలు అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కేడబ్ల్యూఎస్ (61వ వార్డు) టీమ్‌కు రూ.లక్ష, తృతీయ స్థానంలో నిలిచిన ఎస్‌ఎడీ ఎలివన్స్ జట్టుకు రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు నియోజకవర్గ పరిధిలో చాలా కార్యక్రమాలు చేశామని, ఇటీవల భారీ జాబ్‌మేళాతో ఉపాధి కల్పించామన్నారు. ఇప్పుడు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదండి బద్రినాథ్, ప్రభుత్వ సలహాదారుడు మిలిసీయమ్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ పశ్చిమ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహ్మాన్, పలు వార్డుల కార్పొరేటర్లు, క్లస్టర్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు. అలాగే పశ్చిమ పరిధిలో 14 వార్డులకు చెందిన పలు క్రికెట్ టీమ్‌లకు, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాటింగ్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ పొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు.

నీటిలో ఆటలు.. 'టూరిజం' కళ్లకు గంతలు.!

- అనుమతులు లేకుండా ఐదేళ్లుగా వాటర్‌స్పోర్ట్స్
- రుషికొండలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి నిర్వాకం
- మామూళ్లు తీసుకుంటూ కన్నెత్తి చూడని టూరిజం శాఖ డివిజనల్ సిబ్బంది
- ఓ వాటర్ స్పోర్ట్స్ నిర్వాహకుడి అండతో నిర్వహణ
- ఆలస్యంగా గుర్తించిన పర్యాటక శాఖ అధికారులు
- క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు రంగం సిద్ధం
- టూరిజం సిబ్బందిని వెనకేసుకొచ్చేందుకు యత్నాలు

రుషికొండలో స్పీడ్ బోట్స్



సాక్షి, విశాఖపట్నం : అనుమతులు లేవు.అయినా ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదేళ్లగా పైగా సాగరతీరంలో స్పీడ్ బోట్లు నడిపించేశారు. స్కూబా డైవింగ్ చేయించేశారు. అయినా టూరిజం శాఖ అధికారులకు గానీ, సిబ్బందికి గానీ ఈ విషయం తెలీదంట. వాటర్ స్పోర్ట్స్ పేరుతో ప్రభుత్వానికి రూపాయి చెల్లించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి. ఇప్పటికే స్పీడ్ బోట్ల నిర్వహణ ఒప్పందాన్ని కుదుర్చుకున్న ఓ సంస్థ అండతోనే టూరిజం కళ్లుగప్పి నిర్వహించినట్లు తెలుస్తోంది. వాటర్‌స్పోర్ట్స్‌లో నడుస్తున్న దందా గురించి ఆలస్యంగా తెలుసుకున్న టూరిజం శాఖ ఉన్నతాధికారులు క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

వాటర్ స్పోర్ట్స్‌కు కేంద్రబిందువుగా రుషికొండ తీరం మారింది. ప్రతిరోజూ వంద మందికి పైగా పర్యాటకులు స్పీడ్‌బోట్స్, స్కూబా డైవింగ్ చేస్తూ ఉంటారు. ఇక్కడ వీటి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం రెండు సంస్థలకు మాత్రమే అప్పగించింది. వీటితో పాటు టూరిజం శాఖకు చెందిన స్పీడ్ బోట్స్ కూడా ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తూ.. పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే ఐదేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి వాటర్‌స్పోర్ట్స్ నిర్వహణ ప్రారంభించాడు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా స్పీడ్ బోట్స్, స్కూబాడైవింగ్ ఇలా ఇష్టం వచ్చినట్లు వాటర్ స్పోర్ట్స్ నిర్వహిస్తూ రూ.లక్షల్లో ఆర్జించాడు. కానీ పర్యాటక శాఖకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు.

తెలిసినా తెలియనట్లు..

ఈ గుర్తింపు లేని వాటర్‌స్పోర్ట్స్ వ్యవహారాన్ని ఏపీటీడీసీ డివిజనల్ స్థాయి అధికారులు, సిబ్బంది మూడేళ్ల క్రితమే గుర్తించారు. అయినా తమకేమీ తెలీదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దాదాపు దశాబ్ద కాలం క్రితం ఇక్కడ వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేందుకు ఒక సంస్థ పర్యాటక శాఖ నుంచి అనుమతులు తీసుకుంది. సదరు సంస్థకు చెందిన వ్యక్తి ద్వారా రుషికొండ బీచ్‌లోకి ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అనుమతిలేని వ్యక్తి ప్రవేశించినట్లు తెలుస్తోంది. చెల్లింపులు సైతం సదరు సంస్థకే అందజేస్తున్నారని వాటిలో కొంత భాగం డివిజనల్ కార్యాలయానికి చెందిన కొందరికి ముడుపులు ఇస్తున్నట్లు సమాచారం.

ఆలస్యంగా ఉన్నతాధికారుల దృష్టికి..

ఇటీవల పర్యాటక శాఖ ఉన్నతాధికారులు రుషికొండలో జరుగుతున్న వాటర్‌స్పోర్ట్స్ వ్యవహారాలపై సమీక్ష నిర్వహించారు. మరో సంస్థ స్కూబా డైవింగ్ నిర్వహించేందుకు అనుమతులు కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో ఇవన్నీ బయటపడ్డాయి. దీంతో సదరు యూపీకి చెందిన వ్యక్తిని టూరిజం ఉన్నతాధికారులు ప్రశ్నించగా ఇప్పుడెందుకు అడుగుతున్నారు.? ఎప్పటినుంచో ఉంది కదా అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న సంస్థపై కేసు పెట్టాలని డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అయితే ఇంత జరుగుతున్నా తెర వెనుక ఉండి ప్రోత్సహించి తమ లాభాలే తప్ప పర్యాటక శాఖకు రూపాయి కూడా రాకుండా వ్యవహరించిన టూరిజం శాఖ సిబ్బందిని మాత్రం వెనకేసుకొచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి సాయి కళ్యాణ చక్రవర్తి

శభాష్.. బాల

ఔరా అనిపించిన గుడిలోవ విద్యార్థుల విన్యాసాలు



ఆనందపురం : మండలంలోని గుడిలోవలో ఉన్న విజ్ఞాన్ విహార్ ఆవాస విద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం విద్యార్థులు సాహసోపేతంగా చేసిన శారీరక ప్రదర్శనలు, విన్యాసాలు గగుర్పాటు కలిగించాయి. ఆహుతులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. విద్యార్థులు చేసిన విన్యాసాలు వారి ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిశాయి. అందరి చేత ఔరా అనిపించాయి. బాలికలు మోటార్ సైకిళ్లపై చేసిన విన్యాసాలు శభాష్ అనిపించాయి. మండుతున్న అగ్నిగోళం నుంచి విద్యార్థి దూకడం, నడుస్తున్న మోటార్ సైకిల్‌పై విద్యార్థులు చేసిన యోగాసనాలు, శారీరక విన్యాసాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. 30 అడుగులు ఎత్తు నుంచి పదో తరగతి విద్యార్థులు మోటార్ సైకిల్‌తో జంప్ చేస్తూ ట్యూబ్‌లైట్లను పగలుగొడుతూ చేసిన విన్యాసం, మండుతున్న అగ్నిగోళం నుంచి మోటార్ బైక్‌తో దూకడం, వంద అడుగులు ఎత్తున గల రోప్‌పై గాలిలో చేసిన యోగాసనాలు, మల్లకంబపై చేసిన విన్యాసాలు, అందరినీ కట్టిపడేశాయి. తప్పెట గుళ్లు, పులివేషాలు, పిరిమిడ్స్, సామూహిక డ్రిల్ వంటి వాటిని విద్యార్థులు ఎంతో సమన్వయంతో ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.

దేశానికి ఉపయోగపడే విద్యావిధానం అవసరం

దేశానికి ఉపయోగపడే విధంగా విద్యా విధానాలను అమలు పరచాలని విజయనగరం జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్స జడ్జి బి.సాయి కళ్యాణ చక్రవర్తి చెప్పారు. గుడిలోవ విజ్ఞాన్ విహార్ ఆవాస విద్యాలయం వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్య కేవలం ఉపాధి కోసమే కాదని.. దాని ద్వారా దేశ ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని పిలుపునిచ్చారు. మైనస్ డిగ్రీలో దేశ భద్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న సైనికులను స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల తరపున సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వై.వి.అనురాధ, స్టీల్ ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఎస్.కరుణరాజు, విద్యాభారతి అఖిల భారత ప్రధాన కార్యదర్శి అవనీశ్ భట్నాగర్, విజ్ఞాన్ విహార్ కమిటీ అధ్యక్షుడు పి.వి.నారాయణ రావు, డైరెక్టర్ దూసి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మండుతున్న అగ్నిగోళం నుంచి మోటార్‌బైక్‌తో దూకుతున్న విద్యార్థి



మల్లకంబపై అగ్నితో విద్యార్థుల విన్యాసాలు



ట్యూబ్‌లైట్లను పగలుగొడుతూ మోటార్ బైక్‌తో జంప్ చేస్తున్న విద్యార్థులు

సాక్షి స్పెల్ బీకు విశేష స్పందన

- విశాఖలో రీజినల్ స్థాయి పరీక్ష
- అధిక సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు

SAKSHI SPELL Bee 2023-24



స్పెల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య : 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం నగరంలోని అక్కయ్యపాలెంలో గల జ్ఞాననికేతన్ పాఠశాలలో జరిగిన పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను నాలుగు కేటగిరీలుగా విభజించి స్పెల్ బీ పరీక్ష నిర్వహించారు. పాఠశాల, జిల్లా స్థాయిలో ఇప్పటికే జరిగిన పరీక్షలో ప్రతిభ చాటిన విదార్థులు రీజినల్ స్థాయి పరీక్షలో పాల్గొన్నారు. వీటిలో సత్తా చాటిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పరీక్షకు హాజరుకానున్నారు. రవీంద్ర భారతి, శ్రీ చైతన్య, చలపతి, రవీస్ లిటిల్ ఛాంప్, గ్రీన్ సిటీ, శ్రీ విశ్వ, విశాఖ, నారాయణ దొర, వి.టి.స్కూల్, రామకృష్ణ తదితర పాఠశాలల నుంచి విద్యార్థుల పరీక్షకు హాజరయ్యారు. పోటీతత్వాన్ని పెంపొందించేలా నిర్వహిస్తున్న పరీక్ష కావటంతో విద్యార్థులు తల్లిదండ్రులు సైతం ఎంతో ఆసక్తి కనబరిచి, వారే స్వయంగా తమపిల్లలను పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సాక్షి మీడియా ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్ గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి. విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించారు. జ్ఞానని కేతన్ ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్ సునీత పరీక్షలను పర్యవేక్షించి, తగిన సహకారం అందించారు.

పిల్లలకు ఎంతో ఉపయోగం



మా అమ్మాయి లాస్య 8వ తరగతి చదువుతుంది. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్ష రాస్తానని చెబితే ప్రోత్సహించాం. ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

– కట్టా సునీత, విద్యార్థి తల్లి, విశాఖపట్నం

పోటీతత్వం పెరుగుతుంది



మా పెదబాబు 8, చిన్నోడు 5వ తరగతి చదువుతున్నాడు. ఇద్దరినీ కూడా సాక్షి మీడియా గ్రూప్ వారు నిర్వహించే స్పెల్ బీ పరీక్ష రాయిస్తున్నాను. పెదబాబు గతంలో కూడా రాష్ట్ర స్థాయి వరకు వెళ్లాడు. ఇలాంటి పరీక్షల వల్ల పిల్లల్లో పోటీ తత్వం పెరుగుతుంది.

– మజ్జి సుజాత, విద్యార్థి తల్లి, గాజువాక

పోటీ పరీక్షలంటే ఇష్టం



పోటీ పరీక్షలు రాయటం అంటే ఎంతో ఇష్టం. సాక్షి స్పెల్ బీ పరీక్ష ఇప్పటికే రెండు సార్లు రాశాను. ఫైనల్‌కు వరకు వెళ్లాలనే లక్ష్యంతో బాగా ప్రిపేర్ అయ్యాను. స్పెల్ బీ పరీక్ష రాసేందుకు మా టీచర్లు ప్రోత్సహించారు. అమ్మనాన్న ఇక్కడి వరకు తీసుకొచ్చారు.

– వి.భాను చక్రధర్, 5వ తరగతి, విజయనగరం

ఇంగ్లిష్ నేర్చుకోవచ్చు



స్పెల్ బీ పరీక్ష ఫైనల్‌కు వెళ్లాలని మా టీచర్లు అన్ని నేర్పించారు. దీని వల్ల ఇంగ్లిష్ బాగా నేర్చుకోవచ్చు. మా స్కూల్లో పెట్టే పరీక్షల్లో నేను పాల్గొంటాను. అమ్మ నాన్న బాగా ప్రోత్సహించారు. సాక్షి వారు ఇచ్చిన పుస్తకంతో పరీక్షకు సిద్ధమయ్యాను.

– మళ్ల చైత్ర గీతిక, 6వ,తరగతి, శ్రీకాకుళం

ఫైనల్‌కు వెళ్తాను



స్పెల్ బీ పరీక్షలపై మా స్కూల్లో టీచర్లు బాగా నేర్పించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పరీక్షలో విజయం సాధించాను. ఈసారి స్పెల్ బీ పరీక్ష బాగా రాశాను. ఫైనల్‌కు వెళ్తాననే నమ్మకం ఉంది.

– నీలపు ఇతియా, 6వ తరగతి, గాజువాక

10వ వరకు హ్యాండ్ టు ఇండియా ప్రదర్శన, విక్రయాలు

దాబాగార్డెన్స్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని హ్యాండ్ టు ఇండియా ప్రదర్శన, విక్రయాలను ఆదివారం నగరంలోని హోటల్ గ్రీన్‌పార్క్‌లో ప్రారంభించింది. ఈ మేరకు ప్రదర్శన నిర్వాహకుడు మాట్లాడు తూ ఈ నెల 10వ తేదీ వరకు విస్తృత శ్రేణి వస్త్రాలు, ఉపకరణాలతో అద్భుతమైన ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పండగలు, వేడుకలకు అనువైన చీరలు, సల్వార్స్, టాప్స్, లెనిన్ వస్త్రాలు, సంప్రదాయ దుస్తులు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఎక్స్‌పోలో పోచంపల్లి, కలంకారి చీరల నుంచి కోల్‌కతా, భాగల్పూరి ప్రింట్ల వరకు, లక్నో, చికాన్, బెనారస్ సిల్క్ చీరలు వరకు, చేనేతలు, ఎంబ్రాయిడరీ చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. వెంకటగిరి, ఉప్పాడ పట్టుచీరలు, కాంచీపురం నుంచి తెచ్చిన బంగారం వెండి జరీ చీరలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయన్నారు.



చీరను ప్రదర్శిస్తున్న మహిళ

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మెగాస్టార్ ఫ్యాన్ చిత్రం ఆడియో విడుదల



ఆడియో ఫంక్షన్‌లో చిత్రం యూనిట్

బీచ్‌రోడ్డు: జల్లు ప్రొడక్షన్ బ్యానర్స్ కిరణ్ వారియర్ దర్శకత్వంలో లుక్స్ రాజ్ హీరోగా, సోనిరెడ్డి హీరోయిన్లుగా నిర్మించిన మెగాస్టార్ ఫ్యాన్ చిత్రం ఆడియోను ఆదివారం ఆర్కేబీచ్‌లో విడుదల చేశారు. ఆదివారం విశ్వప్రియా ఫంక్షన్ హాల్ ఎదురుగా ఆడియో ఫంక్షన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కంచర్ల సినీ నిర్మాత కంచర్ల అచ్యుతారావు మాట్లాడుతూ వైజాగ్‌లో చిన్న సినిమాలను తెరకెక్కించేందుకు ప్రభుత్వం ఒక స్టూడియోను నిర్మించాలన్నారు. సినిమా థియేటర్లను చిన్న సినిమాలకు కేటాయించాలన్నారు. దర్శకుడు కిరణ్ వారియర్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సమాజానికి అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని ఈ చిత్రం రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో హీరో, హీరోయిన్లు లుక్స్ రాజ్, సోను రెడ్డి, నిర్మాత అల్లు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

కమిటీ సభ్యులతో జేసీ జూమ్ కాన్ఫరెన్స్

మహారాణిపేట: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో వీలైనంత త్వరలో ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. జీవో నం.535లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీంపై కమిటీ సభ్యులతో జాయింట్ కలెక్టర్ ఆదివారం జూమ్ కాన్ఫరెన్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ పలు అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో కమిటీ సభ్యులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. త్వరగా ప్రక్రియను పూర్తి చేసేందుకు సమష్టి కృషి చేయాలని పేర్కొన్నారు.

వచ్చిన దరఖాస్తుల వివరాలను జర్నలిస్టుల హౌసింగ్ కమిటీ కన్వీనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు వి. మణిరామ్ వెల్లడించారు. ఇప్పటి వరకు మొత్తం 821 దరఖాస్తులు అందాయని, అందులో స్టేట్ హెడ్ క్వార్టర్ నుంచి 373, జిల్లాకు చెందినవి 448 ఉన్నాయని వివరించారు. ఆన్‌లైన్ పరిశీలన దశలో ఉన్న మరికొన్ని దరఖాస్తులు ఇంకా అందనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ నగర పరిధిలో వివిధ ప్రాంతాల్లో భూములను గుర్తించాలని, జీవోలో పేర్కొన్నట్లుగా జర్నలిస్టు వాటా 40 శాతం విలువ ఎంత ఉంటుందో తెలపాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. జర్నలిస్టులు కోరుకున్న ప్రాంతాల్లో స్థలాలు మంజూరు చేసేందుకు ఆయా ప్రాంతాల్లో భూమిని గుర్తించాలని ఆర్డీవోలను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను నియోజకవర్గాల వారీగా విభజిస్తూ వివరాలను తనకు సమర్పించాలని సమాచార పౌర సంబంధాల శాఖ డీడీకి సూచించారు.

బొర్రాకు రూ.3.20లక్షల ఆదాయం



బొర్రాగుహలను సందర్శించిన పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. బొర్రా గుహలకు పర్యాటకులు పోటెత్తారు. అరకు–విశాఖ ప్రధాన రహదారి అనంతగిరి పరిధిలోగల కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ సందర్శకులతో సందడిగా మారింది. సుమారు నాలుగు వేల మంది పర్యాటకులు బొర్రాగుహలను సందర్శించగా రూ.3.20 లక్షల ఆదాయం వచ్చిందని బొర్రా గుహల మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు.

స్కూబా డైవర్ల సేవలు స్ఫూర్తిదాయకం



రుషికొండ సముద్ర గర్భంలో వ్యర్థాలను తొలగించిన స్కూబా డైవర్లు

కొమ్మాది: స్కూబా డైవర్ల సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ అన్నారు. విశాఖను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ఎకో వైజాగ్‌లో భాగంగా ఎకో క్లీన్, ఎకో బ్లూ, ఎకో-0 ప్లాస్టిక్ కార్యక్రమాల్లో భాగంగా ప్లాటీపస్ ఆర్గనైజేషన్ స్కూబా డైవర్లు రుషికొండ సముద్ర గర్భంలో వ్యర్థాలను వెలికితీసి అందరికీ ఆదర్శంగా నిలవడం అభినందనీయమన్నారు. రుషికొండ తీరంలో నోడల్ ఆఫీసర్, యూసీడీ ప్రాజెక్ట్ అధికారి డి.లక్ష్మి, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో వ్యర్థాల వెలికితీత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సుమారు మూడు టన్నుల ప్లాస్టిక్, క్లాత్, ఇతర వ్యర్థాలను వెలికితీసినట్లు తెలిపారు. ఆర్కే బీచ్, రుషికొండ బీచ్, సాగర్‌నగర్, మంగమారిపేట, యారాడ బీచ్‌లలో కూడా స్కూబా డైవింగ్ బృందాల సహకారంతో వ్యర్థాలను వెలికి తీసే కార్యక్రమం చేపట్టింది. ఆర్గనైజేషన్ ప్రతినిధి సుభాష్, స్కూబా డైవర్లను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డా.ఎన్. కిషోర్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సొసైటీలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ గడువు పొడిగింపు

అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు అప్పలస్వామి



సొసైటీ లావాదేవీల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కర్రి అప్పలస్వామి, డైరెక్టర్లు

సింహాచలం : అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా దీర్ఘకాలిక రుణాలు చెల్లించే ప్రక్రియను మరో మూడు నెలల పాటు పొడిగించేందుకు నిర్ణయించినట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. సొసైటీ మహాజన సభ ఆదివారం ప్రియాగార్డెన్స్‌లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా కర్రి అప్పలస్వామి మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి సంఘ సభ్యులంతా తోడ్పడాలన్నారు. రుణాలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ తరుణంలోనే దీర్ఘకాలిక రుణాలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా చెల్లించే అవకాశం ఈఏడాది మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే 2016 ఏప్రిల్ నుంచి 2021 మార్చి 31వ తేదీ మధ్యలో బంగారంపై రుణాలు తీసుకొని చెల్లించని వారి బంగారాన్ని పబ్లిక్ ఆంక్షన్ వేస్తామన్నారు. బంగారంపై రుణ వడ్డీని 17శాతం నుంచి 12శాతం వరకు పాలకవర్గం తగ్గిస్తూ వచ్చిందని, సభ్యుల కోరిక మేరకు మరొక శాతం తగ్గించేందుకు చర్యలు తీసుకొన్నామన్నారు. ఈఏడాది ఏప్రిల్ 1 నుంచి బంగారంపై రుణాలు తీసుకునే వారికి 11 శాతం మాత్రమే వడ్డీ వసూలు చేస్తామన్నారు. సొసైటీ తరపున పెట్రోల్ బంకు నిర్వహణకు దరఖాస్తు చేశామన్నారు. సొసైటీలో పనిచేస్తున్న 11 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేశామని వెల్లడించారు. సొసైటీ భవన అదనపు అంతస్తు పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ప్రహ్లాదపురంలో సొసైటీకి 84 గజాల స్థలం ఉందని, దాని పక్కన్ దేవస్థానం హౌస్ బిల్డింగ్ సొసైటీకి 40 గజాల స్థలం ఉందని, ఆస్థలాన్ని సొసైటీ అడుగుతోందని, వాళ్లు అంగీకరిస్తే నిబంధనల ప్రకారం భవనం నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి డివిడెంట్లు అందజేస్తామని తెలిపారు. 2023 మార్చి 31 నాటికి 16,603 మంది సంఘ సభ్యులు ఉన్నారని వారందరికీ త్రిఫ్ట డిపాజిట్‌పై 8శాతం వడ్డీ, షేరుధనంపై 20శాతం వడ్డీని చెల్లిస్తామని తెలిపారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, డైరెక్టర్లు బోర ప్రసాద్, కొలుసు గురునాథ్, పాలూరు సూరిబాబు, లండ రమణ, మజ్జి ధర్మా, ఆకుల నాగరాజు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా యూనియన్ అధ్యక్షుడిగా పి.నాగభూషణం ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక గాంధీనగరం అన్నపూర్ణ బ్యాంక్ ఆవరణలో యూనియన్ మహాజన సభ జరిగింది. ఈ సభలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్.శివరామకృష్ణ, కోశాధికారిగా ఓఎన్ ఈశ్వరరావుతోపాటు 14 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఏడాదిపాటు పని చేస్తుందని ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగభూషణం తెలిపారు. అనంతరం సమావేశంలో పీఏసీఎస్ సంఘాల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సత్యనారాయణ మాట్లాడారు. 1964 యాక్టు ప్రకారం ఉద్యోగుల జీతాలు సమానంగా చెల్లించాలన్నారు. ఏపీసీవోబీ, డీసీసీబీ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు జీతాలు పెంచుతున్నారని, సహకార రంగం ఉద్యోగులకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 8 వేల మంది ఉద్యోగులు, సన్న, చిన్నకారు రైతులకు సేవలందిస్తున్నారన్నారు. వ్యవసాయ రుణాలతోపాటు ఎరువులు క్రిమిసంహారక మందులు అందిస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ పీఏసీఎస్‌లో ఉద్యోగులు చాలీచాలని జీతాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 వేతన సవరణ నేటి వరకూ చేయలేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. ఉద్యోగులు వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి ఒమ్మి ఈశ్వరరావు, కన్వీనర్ లక్ష్మణరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతుని సన్నిధిలో మంత్రి అమర్‌నాథ్

పద్మనాభం: ఏకాదశి సందర్భంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమ వారం పద్మనాభంలో గిరిపై ఉన్న అనంత పద్మనాభ స్వామి, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం మంత్రికి స్వాగతం పలికి పూజలు జరిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు స్వామిని దర్శించుకున్నారు. మంత్రి అమర్‌నాథ్‌కు సుంకర గిరిబాబు సత్కరించి అనంతుని చిత్రపటాన్ని బహూకరించారు. పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

వెలమలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క చిన్నబాబు

సీతమ్మధార : రానున్న ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గానికి అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించే విధంగా పోరాడతామని ఉత్తరాంధ్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్క చిన్నబాబు తెలిపారు. ఆదివారం సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని వెలమ సంక్షేమ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెలమలు 48 లక్షల మంది ఉన్నారని, రానున్న ఎన్నికల్లో అత్యధిక స్థానాలు ఆయా రాజకీయ పార్టీలు కేటాయించాలన్నారు. వచ్చే నెలలో రాష్ట్రంలోని వెలమ ప్రజాప్రతినిధులు, పెద్దలతో విశాఖలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం వెలమ కమ్యూనిటీ భవనానికి 75 సెంట్లు భూమి ఇస్తామని ప్రకటించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెలమ పెద్దలు అల్లు గౌరు నాయుడు, చలుమూరు అప్పల సత్యనారాయణ, ఎర్ర సన్యాసినాయుడు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరావు, ముధురవాడ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చలుమూరు నాయుడు బాబు, కరణం రామునాయుడు, భరత్, సంఘం కార్యదర్శి బండారు రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి మిడతాన బాపు నాయుడు, సంఘం ఉపాధ్యక్షుడు రొంగళి వెంకట త్రినాథరావు పాల్గొన్నారు.

ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు తీర్మానం

సీతంపేట: బుల్లయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆచార్య ఎన్.ఎ.డి.పాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమర్షియల్ సినిమాలు కాకుండా సమాంతర సినిమాలూ ప్రదర్శించాలనే ఉద్దేశంతో ఏర్పడిన సొసైటీ.. ఆ దిశగా పయనించడం వల్లే 20 ఏళ్లుగా మనుగడ సాగిస్తోందన్నారు. నూతన సభ్యులకు స్వాగతం పలుకుతూ సభ్యులకు సొసైటీ ఉపాధ్యక్షుడు కాశి విశ్వేశ్వరరావు నూతన డైరీలు అందజేశారు. ఫిబ్రవరి 6వ తేదీ తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల ఫిల్మ్ ఫెస్టివల్ జరపాలని, ఫిల్మ్ డెవలప్‌మెంట్ చైర్మన్ పోసాని కృష్ణమురళీని అతిథిగా పిలవాలని తీర్మానించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పి.కె.బోస్, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబురావు, రెడ్డి శివకుమార్, అప్పారావు, ఆనందబాబు, కృష్ణారావు, ఉషారాణి, అనూరాధ పాల్గొన్నారు.